క్లుప్తంగా

బీఎల్‌వోలు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

వినుకొండ (నూజెండ్ల): ఓట్ల మార్పులు, చేర్పులలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని బీఎల్‌వోలకు ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, పులిచింతల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీరాములు సూచించారు. పట్టణంలోని జాషువా కళా ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి బీఎల్‌వోలతో ఐదు మండలాల అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌లు, తహసీల్దార్లు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌వో శ్రీరాములు మాట్లాడుతూ నూతన ఓట్ల జాబితాను బీఎల్‌వోలు జాగ్రత్తగా వెరిఫికేషన్ చేయాలని సూచించారు. గ్రామాల్లో పూర్తి విచారణ జరిపి అక్కడ ఉండనటు వంటి వారి ఓట్లను రద్దు చేయాలని, అదే మాదిరిగా కొత్త ఓట్ల చేర్పులను కసరత్తు చేయాలని సూచనలు చేశారు. ఓట్ల మార్పులు, చేర్పులలో నిష్పష్టంగా ఉండాలన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

నాదెండ్ల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యం నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో శోభారాణి చెప్పారు. నాదెండ్ల రెండో హెల్త్ సబ్‌సెంటర్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పేదలకు అందుతున్న వైద్యాన్ని పరిశీలించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి కుటుంబానికి మెరుగైన ఉచిత వైద్యం అందించాలని కోరారు. ఒక్కో పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, 24 గంటల వైద్యం ద్వారా సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. పీహెచ్‌సీలో పనిచేసే వైద్య సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావంతో వైద్యశాఖకు గుర్తింపు తేవాల న్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ప్రియాంక, హెచ్‌వీ సీతామహాలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌వీ అశోక్, ఏఎన్‌ఎం కల్పన, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం తూబాడు సబ్‌సెంటర్‌ను పరిశీలించారు.

నాదెండ్ల ఎస్సైగా బలరామిరెడ్డి

నాదెండ్ల: మండల ఎస్సైగా జె.బలరామిరెడ్డి బుధ వారం విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈయన బొల్లాపల్లి మండలం నుండి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఎస్సైగా పనిచేసిన ఆవుల భాస్కర్ పల్నాడు జిల్లా స్పెషల్ బ్రాంచికి బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన ఎస్సై మర్యాద పూర్వకంగా చిలకలూరిపేట రూరల్ సీఐ వై.అచ్చయ్యను కలిశారు. 2015 బ్యాచ్‌కు చెందిన ఈయన పలు మండలాల్లో ఎస్సైగా పనిచేశారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

యడ్లపాడు: రక్తదానం చేయడం వలన ఆపదకాలంలో ఉన్న మరొకరికి కొత్త జీవితాన్ని ప్రసాదించడమేనని పారిశ్రామిక వేత్త దాసరి చంద్రశేఖర్ చెప్పారు. మండలంలోని బోయపాలెం విశ్వతేజ నూలుమిల్లు యాజమాన్యం, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విశ్వతేజ మిల్లు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 40 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో మిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్, రెడ్‌క్రాస్ డాక్టర్ మేడూరి భాస్కరరావు, ప్రాంతీయ సమన్వయకర్త కిరణ్, మేనేజర్ జానీ రసూల్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులకు అవగాహన

వినుకొండ(నూజెండ్ల): సీటీఆర్ఐ ఆధ్వర్యంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక గంగినేని కల్యాణ మండపంలో బర్లీ పొగాకు సాగు చేస్తున్న జీపీఐ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎం. శేషుమాధవ్ హాజరై రైతులకు అధిక దిగుబడి, నాణ్యమైన పొగాకు పండించుటకు తగు సూచనలు, సలహాలు తెలియజేశారు. సస్యరక్షణ చర్యలు, పురుగు మందు అవశేషాలు లేని పొగాకు, పొగాకేతర అన్య పదార్థాలు అనే అంశాలపై రైతులకు అవగాహ న కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు, జీపీఐ ప్రతినిధులు వై.ఎస్ పాటిల్, జీఆర్‌కే రమేష్ రాజు, జి. వినయ్‌కుమార్, సీహెచ్. వీరారెడ్డి, జీపీఐ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

22న జేఎన్‌వీలో ఇంటర్ ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష

చిలకలూరిపేట: జవహర్ నవోదయ విద్యాలయంలో ఇంటర్మీడియెట్ కోర్సులో ఖాళీ సీట్లను భర్తీ చేసేందుకు అర్హత ప్రవేశ పరీక్షను ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహా రావు తెలిపారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే ఈ పరీక్షలు రాసేందుకు అవకాశం ఉంటుందన్నారు. మద్దిరాల నవోదయ విద్యాలయంలో నిర్వహించే ఈ పరీక్షా కేంద్రంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో దర ఖాస్తు చేసుకున్న విద్యార్థులు పరీక్షలు రాయా ల్సి ఉంటుందన్నారు. జేఎన్‌వీలో మొత్తం ఇంటర్ కోర్సుకు 80 సీట్లు ఉండగా వీటిలో సైన్స్- 20, హ్యూమానిటీ-20 గ్రూపుల్లో ఖాళీ లు లేవన్నారు. కేవలం కామర్స్ గ్రూపులోని 40 సీట్లలో 23 ఖాళీలు ఉన్నాయన్నారు. వీటి భర్తీకి 22న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓఎంఆర్ షీట్ ద్వారా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుందన్నారు. ప్రతిభ చూపిన వారికి ఇంటర్‌లో ప్రవేశాలకు అవకాశం ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

వలంటీర్లకు వందనం

ఆస్పత్రికి వచ్చి... పింఛన్ చేతికిచ్చి...

వినుకొండ టౌన్: పట్టణంలోని కొత్తపేట – 2 సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న చీమకుర్తి సుబ్బులు 2022లో పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లి, వచ్చే క్రమంలో అరుణాచలం వద్ద కారు ప్రమాదంలో రెండు కాళ్ళు ప్రమాదానికి గురై, చికిత్స నిమిత్తం మంగళగిరి ఎన్ఆర్ఐ వైద్యశాలలో చికిత్స పొందింది. ఆ సమయంలో విషయం తెలుసుకున్న వలంటీర్ కట్టెంపూడి రాజేష్ దాదాపు 120కి.మీ ప్రయాణం చేసి, అమెకు అందుతున్న వృద్ధాప్య ఫించన్ నగదును అందచేసి, లబ్ధిదారురాలు సుబ్బులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఆదుకుని ఆదుకున్నాడని వివరించింది. ఎంతో చక్కగా ఇంటింటికీ వచ్చి పథకాలు అందజేస్తూ సేవలు చేస్తున్న ఇటువంటి వలంటీర్లపైన నిందలు వేయడం సరికాదన్నారు.



సుబ్బులుకు ఫించన్ అందజేస్తున్న వలంటీర్ కట్టెంపూడి రాజేష్ (ఫైల్)

ఆర్థిక భారం తీర్చారు

వినుకొండ టౌన్: పట్టణంలోని కొత్తపేట-2 సచివాలయం పరిధిలో నివాసం ఉంటున్న బచ్చు మునిస్వామి రెడ్డి క్యాన్సర్‌తో బాధపడుతూ (2022 ఫిబ్రవరిలో) వైద్యశాలలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో, వలంటీర్ కట్టెంపూడి రాజేష్ వైద్యశాలకు వెళ్లి, ఫించన్ అందించడం పట్ల కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
ఆనాడు వలంటీర్ అందించిన సహకారం వల్ల కొంత ఆర్థిక భారం నుంచి వెసులుబాటు లభించిందని, కుమారుడు బచ్చు భాస్కర్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



మునిస్వామి రెడ్డికి ఫించన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

గడప గడపకు ప్రభుత్వం పరిచయకర్తలు వలంటీర్లు

32వ వార్డు జగనన్న సురక్షలో ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో గడపగడపకు ప్రభుత్వాన్ని పరిచయం చేసిన వ్యక్తులు వలంటీర్లని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. బుధవారం పట్టణంలోని బరంపేట 32వ వార్డులోని బైపాస్ రోడ్డు మసీదు పక్కన మున్సిపల్ ఇంజనీర్ డి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గతంలో రేషన్‌కార్డు ఇవ్వాలంటే నెలల సమయం పట్టేదని, ఇప్పుడు వారం రోజుల వ్యవధిలోనే అందజేస్తారన్నారు. పిల్లలు కార్డు కొన్నా, ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్నందుకు తల్లిదండ్రులకు సంక్షేమ పథకాలు అందకపోతే కార్డులో వారిని విడతీసి పథకాలను పొందే అవకాశం తల్లిదండ్రులకు లభించిందన్నారు. దీంతో పాటు తొమ్మిది రకాల ధ్రువపత్రాలను వెంటనే అందజేస్తున్నామన్నారు. వార్డులో 1464 కుటుంబాలు ఉంటే 1222 మందికి (85 శాతం) ప్రభుత్వం ద్వారా మేలు జరిగిందన్నారు. గత నాలుగేళ్లకాలంలో 460 మంది డ్వాక్రా సంఘీయులకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.67.19 లక్షలు, 387మందికి అమ్మఒడి ద్వారా రూ.1.06 కోట్లు ప్రభుత్వం అందించిందన్నారు. విద్యాదీవెన ద్వారా 360 మందికి రూ.1.05 కోట్లు, వసతి దీవెన 251 మందికి, కాపు నేస్తం 52 మందికి, గతంలో 236 మందికి ఇచ్చే పింఛన్లు ఇప్పుడు 435 మందికి ఇస్తూ రూ.3.28 కోట్లు చెల్లించామన్నారు. మరో 235 మందికి ఇళ్లపట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. మొత్తం మీద వార్డులోని ప్రజలకు రూ.8.13 కోట్ల సంక్షేమ లబ్ధిచేకూరిందన్నారు. ధ్రువపత్రాలు కావాలని 373 మంది దరఖాస్తులు అందజేయగా అందరికీ అందజేస్తున్నామన్నారు. వార్డు పరిధిలోని బ్రహ్మానందరెడ్డి మున్సిపల్ హైస్కూలును రూ.80 లక్షల వ్యయంతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేసి అభివృద్ధి చేయటం జరిగిందన్నారు. సచివాలయం, వలంటీర్ల వ్యవస్థలు, సంక్షేమపథకాలు అందాలంటే మళ్లీ సీఎంగా జగన్‌ను చేసుకోవాలని వార్డు ప్రజలకు సూచించారు.
కార్యక్రమంలో ముది రాజు, గిరిజన, మాదిగ కార్పొరేషన్ల డైరక్టర్లు ఇయం స్వామి, పాలపర్తి వెంకటేశ్వరరావు, కందుల ఎజ్రా, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముడియం శేషమ్మ, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాష, వార్డు ఇన్‌చార్జీలు పుల్లంశెట్టి శ్రీనివాసరావు, నాగూల్‌మీరా, కోటిరెడ్డి, షేక్ వలి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారునికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



శానంపూడిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వి.అప్పాపురంలో గ్రామసభలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఎండుగుంపాలెంలో లబ్ధిదారులకు పత్రాలు అందిస్తున్న నాయకులు, అధికారులు

శానంపూడిలో..

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, మండల గ్రామ స్థాయి అధికారులు, గ్రామసచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమక్షంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు షేక్ జాన్‌సైదులు పాల్గొని మాట్లాడుతూ అర్హత కలిగి యుండి నేటి వరకు సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమం లబ్ధిపొందటానికి ఈకార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం 650 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, ముండ్రువారిపాలెం గ్రామసర్పంచ్ పాపసాని విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, డిప్యూటీ తహసీల్దారు వేముల వెంకట నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ముండ్రు మనోహర్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్పాపురంలో...

వినుకొండ(నూజెండ్ల): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వినుకొండ రూరల్ మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామసభలో పలువురు అధికారులు మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. అనంతరం దరఖాస్తుదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీరాములు, ఎంపీడీవో మంగాపురనాథ్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఈవోపీఆర్‌డీ మోహన్ చంద్, మండలస్థాయి అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూజెండ్లలో..

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని వి.అప్పాపురం, ఐనవోలు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుబాబు, ఎంపీడీవో వీరభద్రాచారి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి యాదవ్, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, ఎంపీటీసీ వెంకటేశ్వరరెడ్డి, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, గ్రామసచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమమే జగనన్న లక్ష్యం

నాదెండ్ల: సంక్షేమ పథకాలు అందరికీ దరిచేరాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఇందుకోసం జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నట్లు జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్ రావు చెప్పారు. మండలంలోని ఎండుగుంపాలెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో 550 గృహాలకు గాను 500 గృహాలను వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సందర్శించి సుమారు 350 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను ఉచితంగా అందించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందించి ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు దరిచేరుస్తున్నామన్నారు. నాలుగేళ్ల పాలనలో ఈ గ్రామంలో రూ.6.83 కోట్ల నిధులు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు అందాయన్నారు.
అనంతరం గ్రామంలోని కొంతమంది తమకు రేషన్ కార్డుల్లో తప్పులు ఉన్నాయని, వాటిని సరిచేసేందుకు రెవెన్యూ అధికారులు పనిచేయటం లేదని అధికారులు, నాయకుల దృష్టికి తెచ్చారు. రేషన్ కార్డుల్లో కొంతమంది ఉద్యోగులు ఉండటం వలన వారికి సంక్షేమ పథకాలు అందటం లేదని, వారిని తొలగించి కొత్త రేషన్ కార్డులు అందించాలని కోరారు. నరసరావుపేట నుంచి గానీ, చిలకలూరిపేట నుంచి గానీ ఆర్టీసీ బస్సులు తమ గ్రామానికి రావటం లేదని, బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. దీనిపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమీజా స్పందిస్తూ త్వరలో గ్రామంలో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి రేషన్ కార్డుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జెడ్పీటీసీ మస్తాన్‌రావు ఆర్టీసీ డీఎంలతో మాట్లాడి, అవసరమైతే మంత్రి రజిని దృష్టికి తీసుకెళ్లి ఆర్టీసీ బస్సు సర్వీసులు ఏర్పాటయ్యేలా కృషి చేస్తామన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఇనాం భూములకు ఎస్సీ ఎస్టీలకు హక్కులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారని, తమ గ్రామంలో నూజెండ్ల అగ్రహారం క్రింద ఉన్న ఇనాం భూములను సాగుదారులకు హక్కులు కల్పించాలని కోరారు. అయితే ఇటీవల జరిగిన రీసర్వేలో తమ గ్రామ భూములు శివారు గ్రామాల్లో ఉన్నాయని, వీటి వలన పంచాయతీకి రావలసిన ఆదాయం కోల్పోతున్నామని, ఈ సమస్యనూ పరిష్కరించాలని కోరారు.
అనంతరం ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ గోరంట్ల కోటేశ్వరరావు, ఎంపీపీ తలతోటి రాణి, నాదెండ్ల సొసైటీ చైర్మన్ కురుకుంట్ల వెంకటరెడ్డి, ఎంపీటీసీ సూరె సరస్వతి, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, చిలకలూరిపేట మార్కెట్ యార్డు డైరెక్టర్ దావల రత్నకుమారి, పార్టీ నాయకులు మద్దూరి కోటిరెడ్డి, పర్వతనేని బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, చపిడి అమరేశ్వరరావు, కందుల బుచ్చయ్య, ఎంఈవో ఆంజనేయులు, మాజీ సర్పంచ్ గట్టినేని రమేష్, సుమంత్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, వీఆర్వో ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

రూపాయి ఖర్చు లేకుండానే..



మాది వ్యవసాయ కూలీల కుటుంబం. బీసీ కులస్తులం. నాకు చేయూత పథకానికి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమయ్యాయి. ఇటీవల జరిగిన సర్వేలో జగనన్న సురక్ష పథకం ద్వారా రెండు సర్టిఫికెట్లు రూపాయి ఖర్చు లేకుండా అందించారు. దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధిలోనే ఫోన్ చేసి మరీ సర్టిఫికెట్లు అందించారు.
– గోరంట్ల శ్రీలక్ష్మి, ఎండుగుంపాలెం

ములకలూరు- పెదరెడ్డిపాలెం నుంచి బైపాస్‌రోడ్డు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- ములకలూరులో 24 గంటల విద్యుత్ సరఫరా పనులకు శంకుస్థాపన

నరసరావుపేట రూరల్: ములకలూరు– పెదరెడ్డిపాలెం గ్రామాల మధ్య నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. మండలంలోని ములకలూరు గ్రామానికి 24 గంటల విద్యుత్ సరఫరా పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నకరికల్లు–చిలకలూరిపేట రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారు ప్రాంతాల నుంచి ఏర్పాటు చేయనున్న బైపాస్‌రోడ్డు ములకలూరు–పెదరెడ్డిపాలెం గ్రామాల నుంచి వెళ్లేలా నూతన ప్లాన్‌ను రూపొందించినట్టు తెలిపారు. నాలుగు లైన్లుగా ఉండే ఈ రహదారి నిర్మాణానికి రూ.750కోట్లు ఖర్చు అవుతుందన్నారు. భూసేకరణకు రైతులు సహకరించాలని కోరారు. పట్టణ శివారు ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా గతంలో ప్రతిపాదించిన బైపాస్ రోడ్డు మార్గాన్ని మార్చినట్టు తెలిపారు. ములకలూరు గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉందన్నారు.
విద్యుత్ శాఖ ప్రతిపాదించిన 24 గంటల విద్యుత్ వలన పారి శ్రామికంగా కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఇప్పటి వరకు గ్రామంలో సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా ఉండేదన్నారు. దీనిని త్రీఫేస్‌లోకి మార్చడంతో పాటు 24 గంటలు విద్యుత్ సరఫరా జరిగేలా ఫీడర్‌కు అనుసంధానం చేస్తా రని వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో 300 విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్స్‌ను ఆధునీకరిస్తారని తెలిపారు. దీని కోసం రూ.50 లక్షలను విద్యుత్ శాఖ ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు, ఏడీఈ ఏడుకొండలు, రూరల్ ఏడీఈ వెంకటేశ్వర రెడ్డి, జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మూరబోయిన శ్రీనివాస రావు, గ్రామ సర్పంచ్ జెర్రిబోతు మేరీ రత్న కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు సున్నీ, యేసు దయ, చింతా రాంబాబు, మోదుగుల శంకర్ పాల్గొన్నారు.



విద్యుత్ సరఫరా పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

మూడు వార్డుల్లో అభివృద్ధి పనులు

నరసరావుపేట: పట్టణంలోని ఎనిమిది, తొమ్మిది, పదో వార్డుల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బుధవారం సాయంత్రం టెంకాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు వార్డుకు రూ.20 లక్షల చొప్పున మూడు వార్డులకు రూ.60 లక్షల నిధులతో చేపట్టిన 15 పనులను ప్రారంభించారు. ఎనిమిదో వార్డు ఇస్లాంపేటలో ఒక సీసీరోడ్డు, ఐదుచోట్ల డ్రెయిన్‌లు, తొమ్మిదో వార్డులోని వివిధ ప్రాంతాల్లో రెండు సీసీరోడ్లు, నాలుగు కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పదో వార్డులో మూడుచోట్ల చేపట్టిన డ్రెయిన్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. వార్డులకు వచ్చిన ఎమ్మెల్యేకు అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్, డీఇ ఓ.శ్రీనివాసరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్.ఏ.హనీఫ్, గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలపర్తి వెంకటేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు మాగులూరి రమణారెడ్డి, బోయిన రామకృష్ణంరాజు, నెలటూరి మురళి, షేక్ కరిముల్లా, షేక్ ఖాజా, బాబూయాదవ్, మిలటరీ కుమార్, సయ్యద్ ఫాతిమా, జోసెఫ్‌రెడ్డి, గాలం కోటేశ్వరరావు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

నరసరావుపేట: స్థానిక కోటప్పకొండ రోడ్డులోని చర్చి ఆఫ్ క్రైస్ట్ చర్చిలో బుధవారం యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ 17వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. పాస్టర్లు ప్రార్థనలు చేసి తానీ స్థాయికి వచ్చేందుకు సహాయ సహకారాలు అందజేశారన్నారు. ఇప్పటికే చాలా పాస్టర్లకు ఇళ్లపట్టాలు ఇచ్చామని, ఇప్పుడు మరో 20 మందికి పట్టాలు అందజేస్తున్నామన్నారు. ఈసందర్భంగా పాస్టర్లు పలువురు పట్టణ ప్రముఖులు, వైఎస్సార్‌సీపీ నాయకులను దుశ్శాలువ కప్పి పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇవాంజలిస్టు బి.జయకర్‌బెంజిమెన్, పలువురు పాస్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నర్సరీ యజమానులు నిబంధనలు పాటించాలి

ఉద్యాన అధికారి షేక్ నబీ రసూల్

బొల్లాపల్లి: నర్సరీ యజమానులు నర్సరీ చట్ట నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీ రసూల్ అన్నారు. మండలంలోని మేళ్లవాగు, రెడ్డిపాలెం పరిధిలో ఉన్న షేడ్‌నెట్ నర్సరీలను ఆయన క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నబీరసూల్ మాట్లాడుతూ నర్సరీ నిర్వాహకులు లైసెన్స్, రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నర్సరీ లైసెన్స్ కోసం షేడ్ నెట్ చుట్టూ 9 నుంచి 14 అడుగుల ఎత్తు వరకు ఇన్సెక్ట్ ప్రూఫ్ నెట్‌తో రక్షణ కల్పించాలని, షేడ్ నెట్ హౌస్‌లో డబుల్ డోర్ సిస్టం కలిగి ఉండాలని, నెట్‌కు గాని, ఇన్సెక్ట్ నెట్‌కు గాని కీటకాలు లోపల ప్రవేశించకుండా ఉండేందుకు నెట్‌కు ఎక్కడా రంధ్రాలు లేకుండా చూసుకోవాలన్నారు. మిరప విత్తనాలను పోట్రేలలో నాటి వాటిని ఎత్తయిన మడులపై అమర్చాలన్నారు. పోట్రేలలో శుద్ధి చేసిన కోకో పీట్ మాత్రమే వాడాలన్నారు. కోకో పీట్‌ను శుద్ధి చేయుటకు ఒక కేజీ ట్రైకోడెర్మా విరిడి, ఒక కేజీ సూడో మోనాస్ కలపాలన్నారు. లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సిన నర్సరీలు ఉన్నట్లయితే యజమానులు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నాణ్యమైన నారును రైతులకు అందించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో రవీంద్ర, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, నర్సరీ యజమానులు తదితరులు పాల్గొన్నారు.




యజమానులకు లైసెన్స్ పత్రాలను అందజేస్తున్న ఉద్యాన శాఖ అధికారి షేక్ నబీరసూల్

మంచినీటి చెరువు పరిశీలన

శావల్యాపురం: ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని మంచినీటి చెరువును బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్, సచివాలయ ఇంజినీరు లక్ష్మణ్‌లు సందర్శించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చొరవతో రక్షిత మంచినీటి పథకం ద్వారా గ్రామస్తులకు సురక్షితమైన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. మంచినీటి చెరువులోని తాగునీరు నెల వరకు గ్రామంలోకి విడుదల చేయడానికి అవకాశం ఉందని, త్వరలో సాగర్ జలాలు విడుదల చేయగానే చెరువులోని నీటిని పూర్తిస్థాయిలో బయటకు పంపిన తదుపరి చెరువును నాలుగు రోజుల పాటు ఎండ బెట్టి, బావిలో కూడా పూడిక తీత పనులు బావి దగ్గర ఏర్పాటు చేసిన పైపులైను మరమ్మతులు చేస్తామన్నారు. అనంతరం నూతనంగా రూ.లక్ష రూపాయల వ్యయంతో రెండు విద్యుత్ మోటార్లు అమర్చుతామన్నారు. మంచినీటి చెరువు చుట్టూ గేదెలు రాకుండా ముళ్లకంచె కూడా ఏర్పాటు చేశామన్నారు.

వలంటీర్లతో ప్రతీ గడపకు సంక్షేమం

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీ బాషా అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరు గురించి వివరించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా 763 కౌలు రైతు కార్డులు జారీ చేశారు. ఉద్యాన శాఖ ద్వారా పండ్ల తోటలకు బిందుసేద్యం పొలాల్లో నీటి కుంటలు ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ అందజేస్తుంది. పశువులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేసి రుణ సౌకర్యం, వైఎస్సార్ పశు నష్టపరిహారంలో భాగంగా యజమానులకు నష్టపరిహారం వంటి పనులకు ఆయా శాఖల అధికారులు వివరించారు. మండలంలో పలు పాఠశాల విద్యార్థులకు కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో సభ్యులు వరికపూడిశెల నిర్మాణ పనుల ప్రారంభించాలని వెల్లడించారు. అనంతరం ఎంపీపీ బత్తి రాములు మాట్లాడుతూ వివక్షతకు తావు లేకుండా పార్టీలు, కుల మతాలకు అతీతంగా సంక్షేమం ప్రతిగడపకు చేరిందన్నారు. వలంటీర్లు స్వచ్ఛందంగా సేవ చేస్తున్నారని కొనియాడారు. రాజన్న హయాంలో రాష్ట్రంలో సంక్షేమ అభివృద్ధితో వెల్లివిరిసిందని, ఆయన తనయుడు జగనన్నతో రాష్ట్రంలో పేదల అభివృద్ధి సాధ్యపడిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

డీఎడ్ కోర్సు ప్రవేశాలకు సర్టిఫికెట్ల పరిశీలన

బోయపాలెం డైట్ కళాశాలలో 33 మంది చేరిక

యడ్లపాడు: డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సు ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్ కళాశాల)లో 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 17వ తేదీ నుంచి మొదటి దశ కౌన్సెలింగ్ మొదలైంది. బోయపాలెంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండేళ్ల డీఎడ్ కోర్సుకు మొత్తం 150 సీట్లు ఉన్నాయి. వీటిలో తొలిదశగా 88 మందిని ఎంపిక చేయడం జరిగింది. ఫేజ్–1 కౌన్సెలింగ్‌లో బుధవారం నాటికి 33 మంది కౌన్సెలింగ్‌కు హాజరై ప్రవేశించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని నేతృత్వంలో డైట్ లెక్చరర్స్ పి.పోలేరు, వి.సుధా ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పూర్తి చేస్తున్నారు.

